# అతని ప్రేమ

ఆకాశం నిర్మలంగా వుంది. నీలం రంగుపై తెల్ల చుక్కలు ఎంబ్రాయిడరీ పనిలా అందంగా, ఆకర్షణీయంగా  వున్నాయి. దూరంగా వున్న పోలీసు ఠాణాలో మూడు గంటలు కొట్టేరు. నిద్రలో మునిగిన ప్రపంచం, కొద్ది గంటల్లో మళ్ళీ వొళ్ళు విరుచుకులేచి, చరిత్రలో మరొక పుట నింపటానికి శ్రమిస్తుంది.

వెన్నెల మసక మసకగా వుంది. ఆ మసక వెన్నెల్లో జైలు గోడలు పొడరు పూసుకున్న పహిల్వానులా వున్నాయి. వాతావరణం నిశ్శబ్దంగా వుంది. అంతలో ఒక చిన్ని ఆకారంలో లోపలి నుంచి జైలుగోడ పైకి ప్రాకింది భయంతో అటూఇటూ చూసి, చటుక్కున బయటికిదుమికింది. వెంటనే, ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకున్నట్టు పరుగెత్త నారంభించింది.

ఆ ఆకారం కనకయ్యది. వాడొచ్చింది నూట తొంభై నెంబరు గది నుంచి. ఎగబ్రాకింది సెంట్రల్ జైలు గోడని.దూకింది మెయిన్‌రోడ్డు పైకి.పరిగెడుతున్నది వాడింటికేసి.

కనకయ్యకి ఆ ఊళ్ళోనే మెయిన్ రోడ్డుమీద కిళ్ళీ షాపుండేది.ఆ దుకాణానికి ఒకప్పుడు చాలా గిరాకీ వుండేది. పెద్ద పెద్ద వాళ్ళందరూ కార్లల్లో, స్కూటర్సుపైన ఎంతదూరాన్నించో వచ్చి, ఓపిగ్గా నిలబడి అతడి చేతిమీదుగా కిళ్ళీలు నమిలేవారు. లేకపోతే బ్రతుక్కి సార్ధకత లేదన్నట్లు, కనకయ్య కొట్లో కిళ్ళీ వేసుకోవటమంటే తమ అంతస్థు చెప్పటానికి ఒక చిహ్నంగా భావించే  వాళ్ళు. అతడి వ్యాపారం బాగానేసాగేది. కాస్తో కూస్తో బ్యాంకులో గూడా నిల్వ చేసేడు.

కనకయ్య పొడుగ్గా వుండేవాడు. ఛామనచాయ రంగు, బొచ్చెని బోర్లించినట్లుగా వుండే క్రాపు, కిళ్ళీలు నమలటం వల్ల ఎర్రగా దానిమ్మ చెక్కల్లా అవుపించే పెదాలు, గుంటకళ్ళు, చిక్కిపోతున్న సినిమా  హీరోలాగాను, వొళ్ళు చేస్తున్న హాస్యనటుడిలాగాను, వుండేవాడు. అతడు దుకాణం తెరిచిన అయిదు సంవత్సరాలు బాగా సాగింది. మొదట్లో సిగిరెట్లు కిళ్ళీలతో మొదలుపెట్టి క్రమ క్రమంగా ఫ్యాన్సీ సామాన్లు, స్టేషనరీ వస్తువులు కూడా జోడించటం వల్ల షాపుకి నిండుదనం, కనకయ్యకి గౌరవం లభించినాయి. ఆ విధంగా అతడి జీవితం అవరోహణలో వుండగానే ఆమెతో పరిచయమైంది.

ఆమె పేరు శాలినీ. ఎర్రగా బొద్దుగా వుండేది. కుర్తా పైజమా ధరించినపుడు ఎత్తుపల్లాలు ఆకర్షణీయంగా కన్పించేవి. జుట్టుని సాపుగా దువ్వి, సగానికి మడిచి రంగు రంగు రిబ్బన్లతో కట్టేది. కోలమొహం, చక్రాల్లాంటి కళ్ళు కొద్దిగా వుబ్బినట్లుండే చిన్ని నోరు వెరసి అపరంజి బొమ్మలా, అందమైన శిల్పంలా వుండేది.

వాళ్ళు మహారాష్ట్రకి చెందిన వాళ్ళు, ఆమె అన్న వ్యాపారరీత్యా ఆ ఊళ్ళో స్థిరనివాసం ఎదురుగా ఏర్పరచుకున్నాడు. కనకయ్య దుకాణానికి ఎదురుగా పైభాగంలో అద్దెకుండేవారు. అన్నా, వదిన, ఆమె ముగ్గురే వుండేవారు. ఆమె అన్న ఎప్పుడూ ఊళ్ళు పట్టుకుని తిరుగుతుండేవాడు అతడి భార్య ఆ ఊళ్ళోనే మరో పేటలో వున్న పుట్టింటివారింటికి ప్రతినిత్యం వెళ్ళేది. ఇక మిగిలింది శాలినీ. ఆమె మేడపైన  వసారాలో చెక్క కుర్చీలో కూర్చుని కనకయ్య దుకాణం వైపు ఆశ్చర్యంగా చూస్తుండేది. కనకయ్య మరమనిషిలా కన్పించేవాడు ఆమెకి. ఆకులు తియ్యటం, కత్తెర పెట్టి చివళ్ళు తెగ్గొయ్యటం, ఆ పైన నీళ్ళు విదిలించటం, తర్వాత సున్నంపట్టించి, దినుసులు, జర్దా తట్టించి, ఆకులు ముడిచి యివ్వటం, డబ్బులు గల్లాలో వేసుకోటం, మళ్ళీ ఆకులు తియ్యటం.... అంతా యాంత్రికంగా చేస్తున్న, అతడు విశ్రాంతి తెలీని యంత్రంలా కనిపించేవాడు అందువల్ల శాలినీ అతడివంక, అతడి చేతులవంకా గుడ్లప్పగించి చూస్తుండేది.

మొదట్లో ఆమెనే గమనించిన కనకయ్య కాస్త యిబ్బందిగా ఫీలయ్యేవాడు. పెద్ద పెద్ద వాళ్ళందరూ దుకాణానికి వస్తుంటారు. బావుండదేమోనని భయపడేవాడు. కాని క్రమేణా ఆ విధంగా తనవంక చూడటం,తనూ పన్చేస్తూనే ఆమెను గమనించటంలో ఏదో అర్థం కాని థ్రిల్లుందని, దాంట్లో హాయివుందని గ్రహించాడు అప్పటినించి అతడికది అలవాటుగా మారి తర్వాత వ్యసనంగా పరిణమించింది.

ఇప్పుడు, శాలినీ ఒక్క పదినిముషాలు అక్కడ కుర్చీలో, తన వంక చూస్తూ కనిపించకపోతే, కనకయ్యకి చేతులు పన్చెయ్యవ్. మెదడు మొద్దుబారిపోతుంది. వెంటనే దుకాణంలోంచి దిగుతాడు. ఈ మధ్యనే తనకు సాయంగా పెట్టుకున్న కుర్రాడుని షాపు చూసుకోమన్చెప్పి, తను నీళ్ళ బకెట్టు తీసుకుని మేడపైకి వెళతాడు. పైన నీళ్ళకోసం ప్రత్యేకంగా టాంకు లాంటిది వుండడంవల్ల ఆ నెపంతో వెడతాడు. ఆమె ఇంటిని దాటుకుంటూ వెళ్ళేటప్పుడు ఆత్రంగా, ఆశగా చూస్తాడు. ఆమె కన్పించేది. ఏ పుస్తకమో చదువుకుంటూ పడుకునుండేది అతడిని చూసి మెత్తగా, హాయిగా నవ్వేది. ఆ నవ్వుచూసేక అతడిలో ఏదో కొత్తగా శక్తి వచ్చినట్లు అన్పించి హుషారుగా వచ్చి మళ్ళీ షాపులోకెక్కేవాడు. మళ్ళీ వ్రేళ్ళు విచిత్రంగా కదిలి వ్యాపారం నడిపేవి.

అలా కొన్నాళ్ళు మూగగా నడిచిన ప్రేమ – అటు తర్వాత మాటలు నేర్చింది. కనకయ్య ఒకరోజు ధైర్యంచేసి పలుకరించేడు. ఆమె కూడా అవకాశం కోసం ఎదురు చూస్తున్న దానిలా పలికింది. ఆపైన కిలకిలమని నవ్వింది.

“ నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి ” అన్నాడు కనకయ్య.

ఆమె ఏం మాట్లాడక, చేతివేళ్ళకి వేసుకున్న గోళ్ళ రంగుని చీకట్లో పరీక్షగా చూస్తోంది, " నాకు వెనకాముందు ఎవరూ లేరు. పెద్దగా చదువుకోలేదు, ఆస్థిపాస్థులసలే లేవు. వున్నదల్లా అక్కడ దుకాణం – ఇదిగో ఈ స్కూటరు. బ్యాంకులో కొద్దిగా బాలన్స్–బస్" అంటూ ఆమె వైపు చూసేడు.

" ఊ ? అయితే " అందామె...

" ఇది నా గురించిన సమాచారం – నువ్వంటే నాకిష్టం – నువ్వు కాస్సేపు కన్పించకపోతే ఏమిటోలా వుంటుంది. దాన్ని చదువుకున్నోళ్ళు ఏవంటారో,, ఏవనుకుంటారో నాకు తెలవదు. మొహబ్బత్ – లవ్ – ప్రేమ అవొచ్చు – కాకపోవచ్చు – కానీ ఇప్పుడది కాదు విషయం. నువ్వంటే నా కిష్టం అని చెప్పాగదూ, అంచేత నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను – ఏవంటావ్ ? " అని చీకట్లో ఆమె వైపు ఆతృతగా చూసేడు

ఆమె కొద్ది క్షణాలు మౌనంగా వుండి, తర్వాత మెల్లగా " నాకూ ఇష్టమే కానీ మా అన్నయ్య ఒప్పుకోడు " అంది భయంగా.

" ఎందువల్ల "

" నాగపూర్‌లో మా బంధువుల కుర్రాడొకడున్నాడు. అతడికిచ్చి పెళ్ళి చేస్తానని మాటిచ్చాడు, కానీ ఆ కుర్రాడు వ్యాపారంలో స్థిర పడేదాకా ఆగమన్నాడు ".

కనకయ్య మౌనంగా దూరంగా కన్పిస్తున్న దీపాలవైపు చూస్తూ కూర్చున్నాడు, తర్వాత మెల్లిగా " ఆ కుర్రాడంటే నీకూ ఇష్టమా – నిజం చెప్పు " అన్నాడు.

ఆమె మళ్ళీ " నా వుద్దేశ్యం మా అన్న అడగలేదు – అంతా వాడే నిర్ణయించాడు. అయినా ఆ కుర్రాడు తిరుగుబోతు – నాకిష్టం లేదు " అంది ఖండితంగా.

కనకయ్యకి ఆ మాట హుషారు, ధైర్యం వచ్చానాయి. తన చేతిని చీకట్లో ఆమె వైపుకు సాచాడు. ఆమె నడుం తగిలింది. మెల్లిగా దగ్గిరకు లాక్కున్నాడు – చెవిలో " వచ్చెయ్యమంటే నాతో వస్తావా ? పెళ్ళి చేసుకుందాం ? " అన్నాడు.

ఆమె అతనికి అంటుకుపోతూ " వచ్చేస్తాను, కానీ మా అన్నయ్య ...... " అంటూ ఏదో చెప్పబోయింది. కానీ కనకయ్య తన చేతలతో ఆమెని మాట్లాడనివ్వలేదు.....

సరిగ్గా పదిహేను రోజులకి వాళ్ళిద్దరూ ఊరిబయట గుళ్ళో దంపతులయ్యారు. కనకయ్యకి పరిచయమున్న కుర్రాళ్ళు పదిమందిదాకా వచ్చేరు. అంతా పావుగంటలో పూర్తయ్యింది. శాలినీ అన్న పెళ్ళికిష్టపడకపోవటం వల్ల రహస్యంగా చేసుకోవలసి వచ్చింది ఆ రోజు కనకయ్య వెళ్ళి అతడినడిగినపుడు ఇంతెత్తున మండిపడటమే కాకుండా, ఊళ్ళో లేకుండా చేస్తానని బెదిరించాడు. ఇక అతడితో అనవసరమన్చెప్పి అతడొచ్చేసాడు.

తర్వాత రహస్యంగా ఏర్పాట్లు చేసి శాలనీకి చెప్పాడు. ఇద్దరూ ఒకటయ్యారు.

తను వుంటున్న గదిలోనే కాపురం పెట్టేడు కావలసిన సామాన్లన్నీ కొన్నాడు వున్నంతలో ఆమె కష్టపడకుండా అన్ని ఏర్పాట్లు చేసేడు. ఇపుడు కనకయ్య చాలా సంతోషంగా వుంటున్నాడు. ఇప్పుడతని కార్యక్రమం గూడా మారింది. ఉదయం ఏడుగంటలకల్లా టిఫిను, కాఫీ పూర్తిచేసి, షాపు తెరుస్తున్నాడు. మధ్యాహ్నం ఒంటిగంటకి భోజనానికెళ్ళి, మళ్ళీ రెండున్నర కొస్తాడు మళ్ళీ రాత్రి పదింటికి షాపు కట్టేసి ఇంటికి వెడతాడు. ఆ రోజు అమ్మకం తాలూకు చిల్లరంతా ఆమె ముందు పోస్తాడు. ఆమె అన్నీ వేరే వేరే పెట్టి లెక్క పెడుతుంది. తర్వాత కబుర్లాడుకుంటూ భోజనాలు కానిస్తారు. అటు తర్వాత వెచ్చ వెచ్చగా వొకళ్ళ చేతిలో మరొకళ్ళు కరిగిపోతూ పరవశిస్తారు. ఆప్యాయతని ఆత్మీయతని చవిచూస్తున్న అతడికి కాలం త్వరత్వరగా కదిలిపోతున్నట్లు, అనిపించింది. శాలినీ అన్నకి వ్యాపారం దెబ్బతినటం వల్ల, అప్పులపాలై, భార్యతో సహా పరారైపోయాడు. ఇపుడు కనకయ్య ప్రపంచం శాలినీ – శాలినీ సర్వస్వం కనకయ్య, అలా హాయిగా, పూలరధంలా సాగిపోతున్న వాళ్ళ దాంపత్య జీవితానికి మీసాల రాముడు, బండరాయిలా అడ్డుపడ్డాడు.

మీసాలరావుడుకి పాతికేళ్ళ లోపు వయస్సు. అతడికి మీసాలు మొలిచాయిగాని, బుద్ధిమాత్రం వికసించలేదు. పరభాషా చిత్రాలు అతిగా చూడడం వల్ల, ఆ సినిమాల్లో హీరోల్లా వుండాలన్నట్లు అతడి వేషభాషలుండేవి. నల్లగా చింత మొద్దులా శరీరం, హిప్పీ క్రాపు, పెద్ద పెద్ద మీసాలు, చేతికి రాగి కంకణం. పరిచయంలేని వాళ్ళకి భయంకరంగాను, వున్నవాళ్ళకి జాలిపుట్టేటట్టుగాను కన్పించేవాడు. అందరూ అతడిని మీసాలరావుడనేవాళ్ళు. వాడి అసలు పేరేమిటో ఎవరికీ తెలీదు. వాడికేం వుద్యోగంలేకపోవటం వల్ల కనకయ్య ఇంటికెదురుగా వుండే సైకిలు షాపులో కుర్చోనేవాడు. శాలినీ కన్పించినప్పుడల్లా వెకిలిగా నవ్వేవాడు– మొదట్లో ఆమె పట్టించుకునేదికాదు. కానీ ఆ వంకర నవ్వులు ముదిరి సైగలుగాను, ద్వందార్ధపు మాటలుగా పరిణమించటం వల్ల కనకయ్యకి ఒకటి రెండుసార్లు మాటల సంధర్బంలో చెప్పింది కానీ కనకయ్య పట్టించుకోక " కుర్రవెధవలు – వాళ్ళతో నీకెందుకు తలుపు గడియపెట్టి కుర్చో మాన్నాడు.....

కాలవాహిని కదిలిపోతోంది... శాలినీకి నెల తప్పింది. ఆమె అన్నా వదినల జాడ తెలీలేదు. ఈ సమయంలో వాళ్ళు సరసనుంటే ఎంత బాగుండేది అనుకుందామె. మీసాలరావుడు సైకిలుషాపులోంచి శాలినికి సైగలు చేస్తూనే వున్నాడు. ఒకరోజు.....

కనకయ్య షాపులో తనపన్లో తలమునకలుగా వుండగా, వాళ్ళుండే పక్కింటికుర్రాడు పరిగెత్తుకుంటూ వచ్చి " మీ ఇంటిదగ్గర గొడవవుతోంద " ని చెప్పాడు. కనకయ్య చెంగున షాపులోంచి దూకి, ఇంటి కేసి పరిగెత్తాడు. చుట్టూ ప్రక్కల ఆడవాళ్ళు గుంపులుగా నిలబడి తగ్గు స్వరంతో మాట్లాడకుండున్నారు. కనకయ్యకి విషయమేమిటో అర్థం కాలేదు. ఎదురుగా సైకిలు షాపులో మీసాలరావుడు ఎవరితోనో ఘర్షణ పడుతున్నాడు. కనకయ్యని చూసిన అతడు మెల్లిగా జారుకోచూసేడు. అది గమనించిన ఒక ఇల్లాలు – " వాడే , వాడే వెధవని పోనివ్వక " అంది.

కనకయ్యకి విషయం అర్దం కాకపోయినా, వెళ్ళిపోతున్న మీసాలరావుడిని చెయ్యిపట్టి ఆపేడు. అంతలో శాలినీ బయటికొచ్చింది. ఏడ్వటంవల్ల కళ్ళు వుబ్బి ఎర్రగా వున్నాయ్. జుట్టంతా చెదిరిపోయింది. మూర్తీభవించిన శోకదేవతలా వుంది. ఆమెను చూసేసరికి కనకయ్య గుండె ఝల్లుమంది. " ఏవైంది…ఏవైంది " అన్నాడు ఆదుర్దాగా. అక్కడ నిలబడ్డ వాళ్ళలో ఒకామె " ఆ చచ్చినాడు ఇంట్లో జొరబడి – అల్లరి పెట్టేడు " అంది.

అంతే కనకయ్య, కనకయ్యలా లేడు– కలకత్తా కాళిలా దూకేడు. అతడిలో అంత కోపం, శౌర్యం ఏమూల దాగున్నాయో ఎవరికీ తెలీదు.

కనకయ్య తోపుడుకి మీసాలరావుడు క్రిందపడ్డాడు. అతడిని అందిన చోటల్లా పశువుని తన్నినట్లు తంతున్నాడు…..

✯ ✯ ✯

జైల్లో నూటతొంభై నెంబరు గదిలో కూర్చుని ఆలోచిస్తే కనకయ్యకంతా ఆశ్చర్యంగానూ. బాధగానూ, మాయగానూ వుంటుంది మీసాలరావుడు అంత రౌడీలా, బలిష్టుడిలా కన్పించినా, తను తన్నిన రెండు తన్నులకే గుడ్లు తేలేసి, నురగలు కక్కేడు? వాడికి గుండెపెరిగిందని, మందులు వాడుతున్నాడని తనకేం తెల్సు ? తనకి ఆరేళ్ళ కఠిన శిక్ష విధించిన జడ్జిగారు, " చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకోవటం నేరం " అని అనడంలో ఆయన వుద్దేశ్యమేమిటి ? అంటే – మీసాలరావుడు తన పెళ్ళాన్ని బలవంతాన ముద్దాడాడని తెల్సినపుడు ఆడినేం అనకండా పోలీసోళ్ళ దగ్గరికెళ్ళి "సార్, ఫలానా మీసాలరావుడనే హీరో గారు నా భార్యను ముద్దాడేడు. అంచేత తమరొచ్చి వాడిని శిక్షించండని చెప్పుకోవాలా ? ఆపైన వాళ్ళు తీరికని బట్టి వచ్చి ఆడు కన్పిస్తే " రేయ్ – మీసాలరావుడూ – మాతో వస్తావురా బాబూ ! " అని అడుగుతారా ? ధూత్ – నీ యవ్వ తనేం చేతకాని వాడా ?

తను చేసిందే ఒప్పు ఇపుడు తనేదైనా బాధపడుతుంటే శాలిని గురించేగాని, తొందరపడ్డానని కాదు.

అవును శాలినీ ఎలా వుంది... వొడిలిపోయిన మందారంలా వుందా ? పగలులేని రాత్రిలా ఉందా ? అన్నం మొహం ఎరుగని అభాగిలా వుందా ? పుట్టిన బిడ్డకి మాటొచ్చి " నాన్నేదని " అడుగుతాడేమోనని భయపడుతున్నట్లుందా ? నా జీవితాన్ని నడిబజారున విసిరేసినానని కోపంతో రుద్రకాళిలా వుందా ? ఎలా వుంది ఎలా బ్రతుకుతోంది.

కనకయ్యకి ఆలోచన. పగలు రాత్రి ఎలా వుంది, ఏం చేస్తోంది అన్న ఆలోచన తప్ప వేరే ధ్యాసలేదు. అక్కడ వాళ్ళు పురమాయించిన పన్లన్నీ యాంత్రికంగా చేసేవాడు . పూలచెట్లకి నీళ్ళు పొయ్యడం, ఆవరణలో గడ్డిని కత్తిరించటం, కంబళ్ళు అల్లటం... వంటివి చకచకా పూర్తిచేసేవాడు తర్వాత విరామ సమయంలో తన ముందుంచుకున్న పింగాణీ బొచ్చెలో వాళ్ళు పడేసే జొన్నరొట్టె, సాంబారు అన్నం వంకచూస్తూ అలానే కూర్చునే వాడు. అపుడూ ఒక్కటే ఆలోచన శాలిని ఈమాత్రం అన్నం తింటోందా ? ఆ ఆలోచన రాగానే ఆకలి చప్పున చల్లారిపోయేది. తన చేతిలో వున్న చిప్పని ప్రక్కనుండే ఖైదీకిచ్చేసేవాడు. అలా అతనిలో పేరుకుంటున్న నిర్లిప్తతని గమనించాడు వార్డెన్ తంగవేలు.

తంగవేలు జైల్లో వార్డెన్ వుద్యోగవిరమణకి ఏడాది, రెండేళ్ళ టైముంది... ముప్ఫై సంవత్సరాలుగా చేస్తున్న సర్వీసు తాలూకు అలసట అతడి మొహంలో స్పష్టంగా కన్పిస్తుంది. అతడు సౌమ్యంగా మాట్లాడుతాడు. సాధారణంగా పోలీసులనంగానే కలిగే దురభిప్రాయం, తంగవేలుని చూసాక మార్చుకోవలసి వస్తుంది. అతడి చూపులు సూదంటురాయిలా తీక్షణంగావున్నాయి, అందరితోను కలివిడిగా వుండి, తనూ వాళ్ళలో ఒకడినన్న భావన కల్గిస్తాయి, ఖైదీలందరికతడు దేవుడు సమయం దొరికినపుడు అందరికీ హితబోధన చేస్తూ, మారువేషంలో వున్న మతాచార్యుడిలా అవుపిస్తాడు.

అతడు కనకయ్యలోని సంక్షోభాన్ని పసిగట్టేడు.

ఒకరోజు కనకయ్య యాధావిధిన అన్నం, రొట్టె ముందు పెట్టుకుని ఎటో శూన్యంలోకి చూపులు సారిస్తున్నప్పుడు తంగవేలు ఆప్యాయంగా " అన్నం ముట్టవేం కనకయ్యా " అనడిగాడు.

తంగవేలు అతడి సరసన చతికిలబడి, భుజం తడుతూ " నాకు ముప్ఫై ఏళ్ళ సర్వీసయింది, ఇదే జైలుగోడలమధ్యన, ఇలాటి నేరస్తుల సరసన నా జీవితంలో అతి ముఖ్యమైనా కాలాన్ని గడిపేను. ఒక విధంగా నేనూ ఆజన్మాంత ఖైదీని. కానీ అందుకు నేను విచారించటం లేదు. సాటిమనిషి, అతనిలోని మనోభావాలని అర్దం చేసుకోవటం ఈ

జైలుగోడలమధ్య  నేర్చుకున్నాను.  నేరస్థుల మనో ప్రవృత్తిని జీర్ణంచేసుకున్నానని అనుకుంటున్నాను ఉదాహరణకి ఇప్పుడు నువ్వు ఏ విషయం గూర్చి బాధపడుతున్నావో చెప్పమంటావా ? అన్నాడు తన అనుభవాన్ని నవ్వులో గుప్పిస్తూ.

“ చెప్పు చూద్దాం ” అన్నాడు కనకయ్య.

తంగవేలు తన చేతిలో వున్న  లాఠీని గడ్డం క్రిందుగా ఆన్చి , దూరంగా చూస్తూ “ నీ  భార్యాపిల్లల గూర్చి అయ్యుంటుంది. ఒక వేళ పెళ్ళికాకపోతే తల్లి తండ్రి, తమ్ముడు ఎవరైనాగానీ నీ మీద ఆధారపడ్డవాళ్ళని తల్చుకుని అయ్యుంటుంది …అవునా ?”.

కనకయ్య తనలోని ఆశ్చర్యాన్ని కనబడరచకుండా “ అవును – సరిగ్గానే ఊహించావ్. నా భార్య, నే చూడనోచుకోని పసిపిల్ల. వాళ్ళిద్దరిగురించి …. ”

“ ఆలోచిస్తున్నావ్ – అవునా. ఇక్కడ కూర్చుని నువ్వేం చెయ్యగలవ్ ”

“ ఏవీ చెయ్యలేను”

“ మరెందుకాలోచన ? ”

“ ఎలా వున్నారో అని ”

తంగవేలు తెరలు తెరలుగా నవ్వేడు… నవ్వి  “ కనకయ్య నీకో చక్కటి రహస్యం చెప్పనా ? ”

చెప్పమన్నట్లుగా చూసేడు కనకయ్య.

“ ఎపుడైనా ఎవరైనా చనిపోయినపుడు అతడి తాలూకు ఆత్మీయులు ఏడ్వటం గమనించావా ? ”

“ లేదు – ఏం ? ”

“ మామూలుగా మనిషి పోంగానే, అతడి భార్యో, తల్లో, పిల్లలో ఎవరన్నా గాని, అతనిపై ఆధారపడి బ్రతుకుతున్న వాళ్ళు, అతడిపై కొండంతాశ వుంచుకున్న వాళ్ళు హృదయవిదారకంగా ఏడుస్తారు అతనితోపాటుగా తాము చనిపోతున్నట్లు, సృష్టి ఆగిపోయినట్లు, కాలం ఆగిపోయినట్లు, నడి సముద్రంలో అతగాడు తమల్ని ముంచేసి తాను మాత్రం తప్పుకున్నట్లు ఏడుస్తారు …అవునా ? ”

“ అవును ….అయితే ? ”

“ సరిగ్గా ఒకవారం తర్వాత మళ్ళీ అదే వ్యక్తులని గమనించితే , అంతటి దు:ఖం వుండకపోగా, తమ తమ బ్రతుకులకి కొత్త మార్గాలు నిర్మించుకుంటూ ఆ ప్రయత్నంలో పోయిన వ్యక్తి వునికినే  మర్చిపోతారు. ఇదీ ప్రపంచం.

కనకయ్య అసహనంగా కదిలేడు “ నాకేం అర్ధంకావటంలేదు ”

తంగవేలు మళ్ళీ అన్నాడు " నీకర్ధంచేసుకునే వయసున్నా, నీ మనసు నీతో సహకరించనందువల్ల ఏవీ అర్ధం కావు. అది సహజం. నే చెప్పేదేమంటే నీ భార్య నువ్వు లేకపోయినా బ్రతగ్గలదు. ఆ మాటకొస్తే నీ భార్యేమిటి, సృష్టిలో ప్రతి జీవి తన గురించి ఆలోచించుకోతగ్గ విజ్ఞతను, ప్రయత్నం చేసుకోదగ్గ తెలివితేటలను, శక్తి సామర్ధ్యాలను దేవుడిచ్చాడు – కానీ, సాగినంతకాలం మనిషి ఆ శక్తులను బయటికి తీయడు కేవలం నీ మీదే ఆధారపడి బ్రతుకుతున్నట్లు – నటిస్తాడు. సమయం వచ్చినప్పుడు తప్పదన్నప్పుడు, జమ్మిచెట్టు మీంచి అస్త్రాలు దింపినట్లు బ్రతకటానికి సన్నద్ధుడౌతాడు.

కనకయ్య కాస్తకటువుగా " నిజమే కావచ్చు. కానీ నా భార్య అమాయకురాలు, జీవితంలో ఎన్నడూ కష్టపడి ఎరుగదు, ఒక్కసారిగా జీవితం తారు మారైంది. అన్నిటికీ నేనే కారణం నిజంగా నేరస్థుడినే " అంటూ తలతిప్పుకున్నాడు.

అంతలో ఎవరో పిలవటంతో తంగవేలు భుజం తట్టి తప్పుకున్నాడు. తంగవేలుకి కొన్నాళ్లు పగలు, మరికొన్నాళ్ళు రాత్రిళ్ళు డ్యూటీ వుండేది రాత్రిపూట డ్యూటీ వుంటే మాట్లాడటానికి వీలుండేది కాదు. పగలు డ్యూటీ వున్నప్పుడు, తన పనంతా పూర్తి చేసుకుని, మిగతా ఖైదీలందరూ ఆటల్లో వున్న సమయంలో, కనకయ్య తంగవేలు ప్రక్కన చేరేవాడు. అతడెన్నో విషయాలు విశేషాలు చెప్పేవాడు. తన సర్వీసులో జరిగిన వింతలు, తను చూసిన ఖైదీల విచిత్రపు మనస్తత్వాలు, ఆ జైల్లోవున్న పెద్ద పెద్ద నాయకుల గురించి వారు చేసిన చిన్న చిన్న పన్ల గురించి చిత్రంగా వర్ణించి చెప్పేవాడు. తన ప్రక్కన వున్నంతసేపు కనకయ్య తన చింతలన్నీ మరచి హుషారుగా వుండటము, తను వెళ్ళిపోతుంటే తనవంక వెర్రిగా చూడటమూ తంగవేలు గమనించి కొద్దిగా చలించాడు. అతడిపై జాలిపడ్డాడు. వాళ్ళిద్దరికి క్రమ క్రమంగా ఒకరిపై మరొకరికి ఆత్మీయతాభావం పొడసూపసాగింది.

ఒకరోజు తంగవేలు అడిగాడు " నీ భార్య ఏం చదివింది ? "

" ఏవీ చదవలేదు "

" ఆమె తాలూకు ఎవ్వరూ లేరా ? "

" లేరు . వున్న ఒక్క అన్న పరారయ్యాడు "

" ఆస్థి డబ్బు – నువ్వు సంపాదించినవి – ఏవీ లేవా ? "

" ఆస్థంటూ ఏమీలేదు. చిన్న కిళ్ళీ బడ్డీ, స్కూటరూ, కొద్దిగా కాష్ – అంతే ! వచ్చేసేటప్పుడు చెప్పేను – అన్నీ తెగనమ్మేయమని – ఏం చేసిందో, ఏమో ? "

ఆమె మాట వచ్చినప్పుడల్లా అతడి మొహంలో బాధ విచిత్రంగా సుళ్ళు తిరగటం గమనించేడు తంగవేలు. భార్య పట్ల అతడికున్న ప్రేమ, దానిలో నిజాయితీ అన్నీ అర్ధమైనాయతనికి.

" అవును. నువ్వింతగా ఆమె గురించి బాధపడుతున్నావ్. కానీ నువ్విక్కడికొచ్చిన తొమ్మిదినెలల్లో కనీసం ఒక్కసారన్నా నిన్ను చూడరాలేదేం "

ఆ మాట విని కనకయ్య తలొంచుకున్నాడు. " ఏమోమరి. అందుకే మరీభయంగా వుంది. కొంపతీసి ఏ అఘాయిత్యమైనా .... " తర్వాత ఆలోచించలేనట్లు కళ్ళు మూసుకున్నాడు.

తంగవేలు ధైర్యం చెబుతున్న వాడిలా భుజం తట్టేడు.

ఆ మర్నాడు కనకయ్యకి వొళ్ళు వెచ్చబడింది. తల తిరగటం, వాంతులు.

జైలు డాక్టరొచ్చి పరీక్షచేసి తిండి సరిగాలేకపోవడం వల్ల అతివుష్ణం చేసిందని మాత్రలు ఇచ్చి వెళ్ళేడు. డాక్టరటు వెళ్ళగానే కనకయ్య మాత్రలు దూరంగా విసిరేసాడు.

అది చూసి తంగివేలు గతుక్కుమన్నాడు. " అదేవిటి అలా పారేశావ్ "

" ఈ మందులుమాకులు నాకొద్దు, ఇలాగే క్షీణించి అంతమైపోతాను . "

" అప్పుడు నీ సమస్య పరిష్కారమౌతుందా ? సమస్యల సుడిగుండంలో చిక్కినపుడు పిరికివాడు చచ్చిపోవాలనుకుంటాడు. కానీ, ధైర్యవంతుడు తెగించి ఆలోచిస్తాడు " అంటూ తనే వెళ్ళి దూరంగా పడ్డ మాత్రలని ఏరుకొచ్చి అతడి చేతిలో వుంచి " నువ్వు ధైర్యవంతుడివి " అన్నాడు అతడి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

" అంటే – నీ ఉద్దేశ్యం ? " అన్నాడు కనకయ్య అతడందించిన మాత్రలని పుచ్చుకుని.

" చెబుతాను – కానీ ముందా మాత్రలు మింగు " అన్నాడు.

కనకయ్య తన చేతిలోవున్న మాత్రలని యాంత్రికంగా ఒకదాని పిదప మరొకటి మ్రింగి, చేదుగా మొహం పెట్టి అతడివంక చూసేడు

" కాస్త తెగింపుచేసి ఆలోచిస్తే, మార్గం నీకే అవుపిస్తుంది " అన్నాడు తంగవేలు ఎటోచూస్తూ.

" అంటే .....అంటే ...పారిపొమ్మనా నీ వుద్దేశ్యం ? "

" ఏం ఒకసారి చట్టాన్ని ధిక్కరించినవాడివి ఆ మాత్రం చెయ్యలేవా ? "

" కానీ పట్టుబడితే ? "

" అక్కడే నీ తెలివితేటలు, సామర్థ్యం చూపించాలి "

కనకయ్యకి అతని ధోరణి అంతుబట్టలేదు. ఎందుకు తనని పారిపొమ్మని ప్రోత్సహిస్తున్నాడు ? పట్టుబడితే అదనపు నేరం . వేరే శిక్షగదా ? అయినా జైల్లోంచి పారిపోవాలంటే మాటలా ? ఎవరన్నా సహాయం చేస్తే తప్ప అది అసాధ్యం.

అతని ఆలోచనాధోరణికనిపెట్టినవాడిలా. తంగవేలు " ఎల్లుండి రాత్రికి నైట్ డ్యూటీ వుంది నాకు " అన్నాడు.

కనకయ్యకి అతడుద్దేశ్యం అర్ధమైంది. అతడంతకన్నా స్పష్టంగా చెప్పలేదు. వుద్యోగ భాద్యతలు అతనిని స్వేచ్ఛగా మాట్లాడనివ్వవు. కానీ తనకెంత ప్రమాదమో, అతడికీ అంతే ప్రమాదం. అయినా తెల్సికూడా ఎందుకు ప్రోత్సహిస్తున్నాడు ? తన మీద వల్లమాలిన అభిమానంతోనా ?

" కానీ, నిజంగా నువ్వన్నట్లు నే తెగిస్తే నీకూ ప్రమాదమేమో ? " అన్నాడు కనకయ్య అతడివంక భయంగా చూస్తూ.

" నిజమే – ప్రమాదమే – ఇంక్రిమెంట్లు ఆపేస్తారు. సస్పెండ్ చేస్తారు. లేదా ఇంకేదో చేస్తారు. అంతేగానీ నా వుద్యోగం, ప్రాణాలు తియ్యలేరుగా " అన్నాడు మొండిగా.

ఆ మాటలు విని కనకయ్య కొద్దిగా చలించాడు. " నా కోసం ఇంతటి సాహసం చెయ్యాలని ఎందుకనుకుంటున్నావ్, నీకు నేను ఏమౌతానని ".

తంగవేలు దూరంగాపన్చేస్తున్న ఖైదీల వైపు సాలోచనగా చూస్తున్నాడు.

కనకయ్యకి ఆరోగ్యం బాగుండకపోవడంతో విశ్రాంతి మంజూరయింది.

అతడి మాటలువిన్న తంగవేలు " నేరస్థుల్లో రెండు రకాల వాళ్ళుంటారు క్షణికమైన వుద్రేకానికిలోనై నేరంచేసే వాళ్ళు – నేరాన్ని వృత్తిగా స్వీకరించే వాళ్ళు.... నువ్వు మొదటిరకానికి చెందినవాడివి. నీ భార్యపై నీకు గల మమకారం, ప్రేమ ఆ క్షణంలో నీచేత ఆ పని చేయించాయి. కానీ మరుక్షణం నించి ఈ క్షణం వరకూ నువ్వనుభవించిన మానసిక అశాంతితో ఆ నేరం చెల్లు " అన్నాడు వుపన్యాస ధోరణిలో.

" పారిపోవటమంటే మాటలా – ఎన్ని అవరోధాలుంటాయో తెల్సుగా " అన్నాడు కనకయ్య.

తంగవేలు కూర్చున్నవాడల్లా చటుక్కున లేచి నిలబడి " ఎల్లుండి రాత్రికి నైడ్యూటీ – అన్నట్టు మర్చేపోయాను. అటు తూరుపువైపు గోడకి ఎవరో మెట్లుగా చెక్కేరని జాన్ అన్నాడు జైలర్తో కంప్లైంటుచెయ్యాలి అనుకుంటూ వెళ్ళిపోయేడు.

కనకయ్యకి అతడి పథకమంతా అర్ధమైంది. ఎల్లుండి రాత్రికి తను నైటు డ్యూటీ చేస్తాడు. గనుక తనగదికున్న తాళాన్ని తెరుస్తాడు. తనని తూర్పు వేపు గోడనెక్కి పారిపొమ్మని అతడి వుద్దేశ్యం.

☆ ☆ ☆

ఇంకా తెల్లవారటానికి కొద్దిగంటలేవుంది. జైల్లోంచి బయటపడ్డ కనకయ్య చకచకా లేని వోపిక తెచ్చుకుని నడుస్తున్నాడు. తెల్లవారకమునుపే, చుట్టు ప్రక్కలవాళ్ళు నిద్రలేవకముందే శాలినీని తీసుకుని బయల్దేరాలి. ముఖ్యమైన సామాన్లు, శాలినితో రైల్వేస్టేషనుకెళ్ళి ఏ రైలు తయారుగా వుంటే దాంట్లోకి జొరబడి, తర్వాత మిగిలిన ఆలోచన చెయ్యాలి.

కనకయ్య నడకని పరుగుగా మార్చేడు.

తంగవేలుని తను మళ్ళీ కల్సుకోగలడా ? ఎలా కల్సుకుంటాడు – అది జరగని పని. అలాగే అతడిని మర్చిపోవటం కూడా జరగని పని. తనని తానే మర్చిపోయే పరిస్థితి రావచ్చు, కానీ తంగవేలుని అతడు చేసిన సహాయాన్ని మర్చిపోలేడు. ఛార్జీలకని కాబోలు యాభై రూపాయలిచ్చాడు, తనిలా వచ్చేయటంవల్ల అతడి వుద్యోగం వూడుతుంది ? అలా జరిగిన పక్షంలో అతడికి తనే విధంగా సహాయం చెయ్యగలడు ?

కనకయ్య వూళ్ళోకి ప్రవేశించాడు.

దూరంగా ఆకాశం తెల్లబడుతోంది. వీధులు నిర్మానుష్యంగా వున్నాయి. అతడు సాధ్యమైనంత వరకూ మెయిన్ రోడ్డుపై నుంచి కాకుండా, చిన్న చిన్న సందులు గొందుల్లోంచి నడుస్తున్నాడు.

ఇంటికెళ్ళి జైలు దుస్తులు మార్చుకునే వరకు జాగ్రత్తగా, ఎవరికంటా పడకుండా వుండాలనుకున్నాడు.

అంతదూరంలో ఇల్లు వుందనగా అతడికో నల్లటి ఆలోచన వచ్చింది. అసలు శాలిని ఆ ఇంట్లో వుందా ? ఆ భావంతోపాటు భయం కూడా పుట్టి, అతడిలో సంతోషాన్ని ఆశని చప్పున చల్లార్చి వేసాయి. అక్కడామె లేకపోతే తనేం చేసేటట్లు ? ఎక్కడ వెతికేటట్లు ? చివరికి తన కష్టం తంగవేలు ఔదార్యం అన్నీ వృదా కాదా ?

వెంటనే తనకు తానే సమాధానం చెప్పుకున్నాడు. ఇప్పుడు ప్రతి క్షణం అమూల్యం అర్ధంలేని ఆలోచన్లతో కాలాన్ని వృధాచెయ్యటం అవివేకం అనుకుంటూ ఇంటిని సమీపించేడు.

ఇంటి ద్వారం రోడ్డుపైకి వుండడంతో, ఇళ్ళని దాటుకుంటూ వెళ్ళాల్సిన పరిస్థితిగాని, ఎవరన్నా చూస్తారేమోనన్న భయంగాని అతడికి కల్గలేదు. వీధి గుమ్మాన్ని సమీపించబోయి, మనసు మార్చుకున్న వాడిలా ప్రక్కనే వున్న కిటికీలోంచి తొంగిచూసేడు, ఎందుకన్నా మంచిదన్నట్టు.

ఎక్కడినించో గడియారపు గంటలు గుండెల్లో కొడుతున్నట్లు వికృతంగా విన్పించినాయి. మెయిన్ రోడ్డుపై లారీ రొదపెట్టుకుంటూ వెడుతోంది.

అలా గదిలోకి చూసిన అతడి కళ్ళకి ముందుగా కన్పించింది – పెద్ద టేబులు దానిపైన కిరసనాయిలు దీపం. దాని ప్రక్కనే అందమైన ట్రాన్సిస్టర్. గది చిన్నది కావడం వల్ల వెలుగు స్పష్టతని ప్రసాదిస్తోంది. తన కళ్ళబడిన ట్రాన్సిష్టరు వైపు గుడ్లప్పగించి వెర్రిగా చూసేడు. అది అతడిది కాదు. పెళ్ళయిన కొత్తలో శాలినీ చాలాసార్లు కొనిపెట్టమనడిగింది. కానీ కుదరనేలేదు. కానీ ఈ కన్పిస్తున్న ట్రాన్సిష్టరెవరిది ? అది చూసేక అతడిలో అనుమానం కదిలింది – శాలినీ ఇల్లుమారిందోమోనని. అంచేత చూపులు గదిమధ్యనే తిప్పేడు. రెండు పట్టెమంచాలు ప్రక్క ప్రక్కగా వున్నాయ్. ఒక దానిపై చిన్ని పాపాయ్ వులెన్‌రగ్గు క్రింద వెచ్చగా పడుకుంది. ఆ రగ్గు చివర్లలోంచి బైటకొచ్చిన లేతపాదాలకి చిరుగజ్జెలు.....

కనకయ్య తన దృష్టిని రెండో మంచం పైకి తిప్పేడు.

అప్పుడే చూసేడు శాలినిని.

ఎవరి కంటితడి చూడేలక తను సాటిమనిషిని మట్టుపెట్టాడో ఎవరికోసమైతే తను ప్రతిక్షణం , ప్రతి నిమిషం, ప్రతి గంట, ప్రతి రోజూ .... తపించాడో, ఎవరికోసమైతే తను చట్టానికి కళ్ళుగప్పివచ్చాడో ....

ఆ శాలిని హాయిగా, సుఖంగా, ఏ బాధ లేనట్టు, ఎవరి బాధలు తనవి కానట్టు పడుకునుంది.ఆ గదిలోని చిరువెలుగు ఆమె మొహంపై పడి అందంగా ప్రకాశిస్తోంది. ఆమెని నోటి నిండుగా పిలవాలని, తన ప్రేమ, ఆరాధన, మమకారం అన్నీ తనగొంతులో గుప్పించి " శాలినీ వచ్చేసాను – నీ కోసమే వచ్చేసా " నని పిలవాలనుకుంటుండగా అతడు కన్పించాడు.

అతడు ఎర్రపూల లుంగీ, బనీను ధరించాడు, మనిషి మంచి దృఢకాయుడిలా వున్నాడు. నిద్దట్లో చెదిరిన లుంగీలోంచి కన్పిస్తున్న పిక్కలు, తొడలు పచ్చగా వున్నాయి. అతడు పడుకున్న వైపు వెలుగు సరిగా ప్రసరించకపోవటం వల్ల మొదట్లో కనిపించలేదు.

కనకయ్య కళ్ళు చిట్లించి అతడిని గుర్తించాలని ప్రయత్నించేడు. కానీ ఎప్పుడూ, ఎక్కడా చూసినట్లు అన్పించలేదు. ఎవడతను ? అప్పుడు శాలిని చెప్పిన తిరుగుబోతుగాడైన నాగపూరు బంధువుల కుర్రాడా ? ఎందుకంత సన్నిహితంగా, బహిరంగంగా, అసభ్యంగా....

ఆలోచిస్తున్న కనకయ్యకి ఆ చీకట్లో ఏదోలీలగా అవగాహనైనట్లు, బ్రతుకు రీతి మనిషి నైతిక శాస్త్రంలోని చీకటి పర్వం అర్థమైనట్టు అన్పించింది. అతడి మెదడులోని నరాలు

చకచకా కదిలి జ్ఞాననేత్రాన్ని తెరిపించినాయి. తంగవేలు చెప్పింది నిజమే ! కాకపోతే – అతడు జమ్మిచెట్టులా మీదనించి అస్త్రాలను దింపినట్లు, సమయం వస్తే మనిషి బ్రతకటం కోసం శ్రమిస్తాడు. కృషి చేస్తాడు – అని చెప్పాడు. కానీ, అస్త్రాల్లాంటి శక్తులను దిగుమతి చేసుకోవటమే కాకుండా, అవుసరమైతే తను అప్పటివరకూ ఆక్రమించిన వున్నత స్థానాన్నించి రెండు మెట్లు దిగుతాడు.....

కనకయ్య మళ్ళీ గదిలోకి చూసేడు

ఇప్పుడాతను పడుకోవటంలో పద్దతి మార్చి, శాలినీకి దగ్గిరగా వచ్చి ఆమె నానుకొని పడుకున్నాడు.

ఇప్పుడు కనకయ్యలో ఆమెని పిలవాలన్న ఆశక్తి గానీ, లేపుదామన్న ఆలోచనగానీ లేవు ఉత్సాహం చప్పున చల్లారిపోయింది.

అతడిలో తెల్లవారిపోతోందన్న ఆదుర్దా భయాలు కూడా లేవు.

అతడిలో ఒక్కటే ఒక్క ఆలోచన.

శాలినీ అసలు తనని ప్రేమించిందా ? లేక అలాగని తను భ్రమ పడ్డాడా ? ఆమె తనని ప్రేమించింది – కానీ బ్రతకటానికి ఒక మార్గం చూసుకుందని భాష్యం చెప్పుకుని వూరటచెందాలా ? అసలు ప్రేమవేరు – బ్రతుకు వేరా ? అలా పరాయిమగాడిచేతిలో వున్నా ఆ మనిషి గుండెల్లో తనపై ప్రేముండే అవకాశం వుందా ?

చివరికి కనకయ్య ఒక నిర్ణయానికొచ్చాడు. ఇప్పుడు ప్రేమ గురించి, నిజాయితీ గురించి తర్జనభర్జనలనవసరం. ఇప్పుడు ప్రస్తుత కర్తవ్యమేమిటి ? ఆమెని మేల్కొలపటమా – లేదా ? అదే సమస్య.

ఆమెని మేల్కొలపటం వల్ల ఏవిటి పర్యవసానం ? సాఫీగా సాగుతున్న ఆమె జీవితంలో మళ్ళీ చేదుగుర్తులా తను .... అయినా యిన్నాళ్ళూ అక్కడ జైలుగోడలమధ్యన కూర్చుని దేన్ని గూర్చి తను బాధపడింది. ఆమె సుఖంగా వుందో లేదోననిగదా ? ఆమె హాయిగా, సుఖంగా వుండటమేకాకుండా, తన జీవితానికి కావలసిన భద్రతని గూడా ఏర్పాటుచేసుకుంది గదా ? మరి తనకేవిటి బాధ – తనకెందుకు బాధ ?

అవును – అనవసరం ...తన వునికిని ఆమెకి తెలియచెప్పటం అనవసరం, ఆమె హాయిగా వుండాలి. అంతే తనకి కావలసింది అనుకుంటూ తల త్రిప్పుకుని వెళ్ళబోతుంటే, అతని దృష్టి మళ్ళీ చిన్న లేతపాదాలు, వాటికున్న చిరుగజ్జెలపైపడి ఒక్క క్షణం పరీక్షగా, ఆప్యాయంగా చూసుకున్నాడు.

అప్పుడు అతడి కళ్ళలో నీళ్ళు చిమ్మినాయి....

అంతే అక్కడినించి కదిలి రెండడుగులు వేసి మళ్ళీ ఆగేడు.

ఇపుడు తన పరిస్థితేమిటి ? ఎక్కడికి పోవాలి – ఏం చెయ్యాలి ? ఎవరికోసం, ఎందుకు చెయ్యాలి ?

ఆ భావన రావటంతో అతడి కళ్ళలో మరిన్ని నీళ్ళు నిండినాయి.

వాటిని చొక్కాతో తుడవాలని ప్రయత్నిస్తుండగా, జేబులోనున్న యాభై రూపాయల కాగితం గరగరలాడింది.

వెంటనే అతడికి సమాధానం లభించింది.

తనకెవరూ లేకపోవటమేమిటి ? తనకి తంగవేలున్నాడు. అతడే తండ్రి అతడే అన్న, అతడే తమ్ముడు, స్నేహితుడు, అన్నీ అన్నీ అతడే తనకోసం అంతగా తెగింపు చేసిన అతగాడికంటే తనకెవరు ముఖ్యం ? అతడు జైల్లో వుండిపోయిన దేవుడు. ఇపుడు తన తక్షణ కర్తవ్యం అతడికి సహాయం చెయ్యటం.

కనకయ్య తలెత్తి ఆకాశం వంక చూసేడు.

ఇంకా కొద్ది సేపట్లో పూర్తిగా తెల్లవారబోతోంది. తంగవేలు డ్యూటీ దిగుతాడు....తను పారిపోయాడన్న విషయం గుప్పుమన్నాక, ఇక తంగవేలుకి డ్యూటీకొచ్చే అవసరం వుండదు. అంచేత, అతడు డ్యూటీ దిగేలోపునే తను మళ్ళీ వెళ్ళి నూట తొంభై నెంబరు గదిలో కూర్చోవాలి. అదే తంగవేలుకి తను చెయ్యగలిగే సహాయం. దక్షిణం వైపు గోడకి బయటవైపున పెద్ద రావిచెట్టుంది. అది ఎక్కి తను సునాయాసంగా లోనికెళ్ళగలడు. తంగవేలుకి ఏమీ జరగటానికి వీల్లేదు. అతడు తనకి మిగిలిని ఏకైక ఆప్తుడు.

ఆ మసక వెల్తుర్లో అలాగ నిర్ణయించుకున్నాక కనకయ్య మళ్ళీ జైలువైపుగా పరిగెత్తనారంభించాడు.

శంకమంచి పార్ధసారధి

స్వాతి మాస పత్రిక, ఏప్రిల్ 1984

------ అయిపోయింది -------